కథ

# సముద్రమూ- కళ్ళజోడు!

వెలెడంత లేదు ఎంత పొగరు. క్లాసురూంలో కూడా వీడు కళ్ళజోడు తీయడేం!"

యాకోబును చూస్తూ కోపాన్ని దిగమింగుకున్నాడు సముద్రం.

'వీడి బాబేదో చిరుద్యోగం వెలకబెడుతున్నాడేమో ఇంతే ఈ ఎస్సీ నాయాళ్ళకు కాస్త ఆశ్రయం దొరికితే కన్నూ, మిన్నూ కనబడదు'

అంతర్లీనంగా వున్న అగ్ర వర్ణ అహంభావమో! ఎస్సీలంటే అణిగిమణిగి పడివుండాలన్న ఒక నిశ్చితాభిప్రాయమో!?

యాకోబు తీరుకు ప్రతిచర్యోగాని సముద్రానికి చాలా అసహనంగా వుంది.

'అంతే తమ్ముడూ! రోజులే అలా వున్నాయి వీళ్ళని ఇపుడు ఏమనేపాటులేదు. పొరపాట్న ఓ మాట అన్నావే అనుకో. ఎస్సీ, ఎస్టీ యాక్టు కింద బొక్కలో తోయిస్తారు.'

జర్దా కిల్లీ తుపుక్కున వూస్తూ సీనియర్ కొలీగ్ సుధాకర్రావు అన్న మాటలు గుర్తుకొచ్చేయి సముద్రానికి.

గలగలా నవ్వేస్తూ సుధాకర్రావే ఓ వర్గీకరణ ఏకరువు పెట్టేడు.

ఆ వర్గీకరణ ప్రకారం దేశంలో బాలబాలికలు రెండు వర్గాలు. ఒకటి ప్రభుత్వ బాలబాలికలు రెండోది ప్రైవేటు బాలబాలికలు.

స్కూలు పక్కన రోడ్డువారగా వున్న టీ బడ్డీ అరుగుమీద కూచుంటూ 'ప్రతీదీ ఉచితంగా ఇస్తున్నారుగా! లెక్కా! జమా! లేదు. అందుకే మాలమాదిగ వెధవలు వుత్త పొగరుబోతులుగా తయారౌతున్నారు పైసాఖర్చులేదు. సర్కారీ సొమ్ము బాధ్యత ఏం వుంటుంది చెప్పు' జవాబు అక్కర్లేని శ్రీవాత్సవ ప్రశ్న.

'అమ్మా, నాన్నల డబ్బు తగలేస్తూ మన బాల్యంలో మనం మాత్రం ఎంతమేరకు అకౌంటబిలిటీతో బతికామంటావ్' శాస్త్రి మాస్టరు చురక.

'ఇదిగో శాస్త్రీ! నువ్వెక్కడ దొరికావయ్యా బాబూ!' సుధాకర్రావు చిరాకు.

శాస్త్రి మాస్టరు మాట ఆలోచనాత్మకంగా వున్నా సముద్రానికి ఏకీభవించాలనిపించదు.

"మెదక్ హత్నూరా మండలంలో దళితులకు మలమూత్రాల తీర్థం" పేపర్లోని వార్తను గట్టిగా చదివేడు శాస్త్రి. సముద్రం తోసహా, ఎందుకో ఎవరూ మాట్లాడలేదు.

ఆ నిశ్శబ్దంలో ఒక అసహనం.


** ** **

స్కూల్లో టీచరుగా చేరి నెల రోజులు కావొస్తోంది. అది ఎస్సీ విద్యార్థుల కోసం ప్రభుత్వం నెలకొల్పిన గురుకుల పాఠశాల. వూరికి కాస్తంత దూరంలో మంచి బిల్డింగ్‌లో వుంది స్కూలు. విశాలమైన మైదానం. ప్రశాంతమైన వాతావరణం. సముద్రానికి అపుడే అంతా పరిచయమౌతూ వున్నారు. కొత్తదనంపోయి వూరికీ స్కూలుకీ అలవాటుపడుతున్నాడు. అంతా బాగానేవున్నా పిల్లవెధవ యాకోబు ధోరణే నచ్చట్లేదు. కొలీగ్స్ ముందు వాడి గురించి ప్రస్తావిద్దామనుకుని, పోనీలే అని సరిపెట్టుకున్నాడు.

నిజానికి యాకోబు చురుకైన కుర్రాడు. బ్రైట్ స్టూడెంట్. వాడి ప్రశ్నలకు కొన్నిసార్లు సముద్రం తడుముకోవలసి వచ్చింది.

యాకోబులో సముద్రానికి నచ్చనిదల్లా ఆ నిర్లక్ష్యం, దూకుడుతనం. వీటికితోడు

**కొండెపోగు బి.డేవిడ్ లివింగ్‌స్టన్**




**తాను ఎప్పటికైనా ఆ కలెక్టరులా కళ్ళజోడు పెట్టుకోవాలి. తండ్రినడిగితే బాగా చదువుకోవాలి అంటాడు. చదువుకు, కళ్ళజోడుకు సంబంధం ఏమిటో అనుకునేవాడు సముద్రం.**

ఆ కళ్ళజోడుతో ఫోజొకటి.

యాకోబు కళ్ళజోడు సముద్రాన్ని చిన్ననాటి రోజుల్లోకి లాక్కెళ్ళింది.

తమ కూలీ పెంచమని లేకుంటే పనిలోకి రామని వాడలోని మాల, మాదిగలు గొడవపెట్టుకున్నారు.

రైతులు వేరే ఊరి నుండి జనాన్ని లారీల్లో రప్పించడం వాళ్ళూ, వీళ్ళూ ఘర్షణ పడడం ఎవరో వాడలోని గుడిసెలకు నిప్పుపెట్టడం జరిగిపోయాయి. ఆ నిర్వాకంలో సముద్రం తండ్రి శ్రీశైలం పాత్ర తక్కువదేమీకాదు.

అంతా బూడిదైపోగా మొండిగోడలతో మిగిలిపోయింది వాడ.

ఆరోజు ఆ వూర్లో దిగాడు జిల్లా కలెక్టరు. సముద్రం తండ్రి శ్రీశైలమే ఆ వూరికి మునసబు. కలెక్టరు మునసబు, కరణాలతో చర్చిస్తున్నాడు. బక్క జనం అంతా చేతులు నలుపుకుంటూ తమ గోడు వెళ్ళబోసుకుంటున్నారు.

కలెక్టరు తెల్లకారు చుట్టూ గోచీలు ఎగలాక్కుంటూ మూగిన వాడపిల్లలు. కలెక్టరు వెంట పోలీసు బృందం.

అప్పుడు చూశాడు సముద్రం.

కలెక్టర్ కళ్ళజోడు గోల్డుఫ్రేంతో మెరిసిపోతూ వుంది.

తాతయ్యకీ వుంది విరిగిపోయిన డొక్కు కళ్ళజోడు ఏనాడైనా ముట్టుకోనిచ్చేవాడా?

తాను ఎప్పటికైనా ఆ కలెక్టరులా కళ్ళజోడు పెట్టుకోవాలి. తండ్రినడిగితే బాగా చదువుకోవాలి అంటాడు. చదువుకు, కళ్ళజోడుకు సంబంధం ఏమిటో అనుకునేవాడు సముద్రం.

కాలం గడచిపోతూ వుంది. సముద్రం స్కూల్ లైఫ్ ముగించి కాలేజీలో చేరాడు. అప్పటిదాకా కళ్ళజోడు గుర్తుకువచ్చింది కాదు.

పబ్లిక్ పరీక్షలు వ్రాయడానికి తమ కాలేజీకి సెంటర్ లేదు. మరో డిగ్రీ కాలేజీని సెంటర్ చేశారు. అప్పుడు ప్రత్యక్షమైంది కళ్ళజోడు మళ్ళీ.

ఆ ఇన్విజిలేటర్ కెమిస్ట్రీ లెక్చరరుట. చలువ కళ్ళజోడులో నుండి ఏమీ కనబడేది కాదు. దాంతో ఇన్విజిలేటర్ ఎవర్ని గమనిస్తున్నాడో తెలిసేదికాదు. ఎవరికి వారు తముదుకునేవాళ్ళే! కళ్ళజోడులో ఇదో సౌకర్యం అన్నమాట. ఏదిఎలా వున్నా సముద్రానికి కళ్ళజోడు ముచ్చట మాత్రం తీరలేదు.

** ** **

గురుకులంలో తన ఉపాధ్యాయ పర్వంలో నెలరోజులు నిండాయి. సముద్రానికి జీతాలొచ్చాయి.

మంచి కళ్ళజోడు, షూస్ కొనుక్కున్నాడు.

పరీక్షల్లో అవసరమని చెప్పి తండ్రి కాలేజీ రోజుల్లోనే గడియారం కొని పెట్టాడు.

కొంత డబ్బు ఇంటికి యం.వో చేసి స్కూలు క్యాంపస్‌లో అడుగుపెట్టేడు సముద్రం.

ఎదురుగా కళ్ళజోడుతో యాకోబు ప్రత్యక్షం.

"వెధవ గ్రౌండులో కూడా కళ్ళజోడు తీయడేం"

"గుడ్మార్నింగ్ సార్!" "ఊ!" అంతకు మించి సముద్రం గొంతులో నుంచి ఏమీ పలుకలేదు.

** ** **

అసెంబ్లీ ముగిశాక మొదటి పీరియడ్ "కన్ను నిర్మాణం" పాఠం చెప్పి కూచున్నాడు.

"సార్! వీడు నా పెన్ తీసుకుని ఇవ్వడంలేదండీ!"

బెల్లు కోసం ఎదురుచూస్తూ కుర్చీలో కూలబడ్డ సముద్రానికి ఆశీర్వాదం ఫిర్యాదు.

"ఎవడ్రా వాడు, తీసుకురా!"

"యాకోబు సార్!"

సముద్రం కోపం నసాలానికెక్కింది.

యాకోబు మెల్లిగా వచ్చి నిలుచున్నాడు. పైకి దువ్విన వాడి జుట్టు నిర్లక్ష్యాన్ని రెండింతలు చేస్తున్నట్టుంది.

"కాదు సార్. ఆ పెన్ ఎక్కడో పోయిందండీ! ఇంకో పెన్ కొనిస్తానన్నా, ఇప్పుడే కావాలంటున్నాడండీ!"

యాకోబు జవాబుకో ఫిర్యాదు.

"అసలు వాడి పెన్ను ఎందుకు తీసుకున్నావోయ్!"

చాచి లెంపకాయ కొట్టేడు.

యాకోబు బుల్లి కళ్ళజోడు ఎగిరి అంత దూరంలో పడి భల్లున పగిలిపోయింది.

వాడు ఏడుస్తున్నాడు.

అప్పుడు చూశాడు, వాడి కళ్ళవైపు.

అందులో ఒకటి చలనంలేని గాజుకన్ను. సముద్రం మనసు చివుక్కుమంది. ●